క్లుప్తంగా

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి



అమీనాబాద్‌లో సచివాలయ కన్వీనర్‌కు కిట్‌ను అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని వైఎస్సార్ సీపీ సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్ సూచించారు. మండలంలోని అమీనాబాద్‌లో సర్పంచ్ నక్క మణికంఠబాబు స్వగృహం వద్ద ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులు ఎవరైనా ఉంటే గుర్తించాలన్నారు. పింఛన్ల పంపిణీలో గ్రామ సర్పంచులతో పాటు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొనాలని సూచించారు. ఈ నెల 7వ తేదీ నుంచి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై స్టిక్కర్‌ను అతికించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మేరుగు ఎల్లాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో జలమయం



సామర్లకోట సత్యనారాయణపురం రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

సామర్లకోట: అకాల వర్షానికి మున్సిపాలిటీ, మండల పరిధిలోని రహదారులు జలమయమయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం అరగంట పాటు ఈదురు గాలులతో వర్షం కురిసింది. దాంతో మామిడి కాయలు రాలి పోయాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కోతకు వచ్చిన వరికి నష్టం జరిగే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దాపురం రోడ్డు, జయలక్ష్మీ థియేటర్ రోడ్డు, సత్యనారాయణపురం, సీతారామ కాలనీ, భాస్కర్‌నగర్, అయోధ్యరామపురం, సంపెంగ తోటలోని రోడ్లు వర్షపు నీటితో నిండిపోయాయి. ఆయా రోడ్ల మార్జిన్‌లో ఇరువైపులా ఉన్న డ్రైన్లను మూసి వేయడంతో వర్షపు నీరు పాయే మార్గం లేక నీరు నిలిచిపోయింది. దీంతో వాహనచోదకులు, పాదచారులు అవస్థలు పడ్డారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం



కొత్తపల్లిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ వేణుగోపాల్

కొత్తపల్లి: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని 5 పరీక్ష కేంద్రాల్లో 1102 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని ఎంఈఓ వేణుగోపాల్ తెలిపారు. కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని ఏ సెంటర్‌లో 238 మంది, బి సెంటర్‌లో 237 మంది, వీవీఎస్ కళాశాలలో 193 మంది, మూలపేట జిల్లా పరిషత్ పాఠశాలలో 230, కొమరగిరి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 204 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

మరో ఐదుగురికి కోవిడ్

కాకినాడ క్రైం: జిల్లాలో ఆదివారం మరో ఐదుగురికి కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. బాధితుల్లో 9, 10, 14 ఏళ్ల ఇద్దరు బాలురు, ఓ బాలికతో పాటు 22, 23 ఏళ్ల ఇద్దరు యువతులు ఉన్నారు. వీరిలో ఇద్దరు పేకేరు గ్రామానికి చెందిన వారు కాగా, ఒకరు పెద్దాడకు చెందిన వారు. ఓ బాలికది కాకినాడ. బాధితుల్లో ఓ యువతి కాకినాడ రంగరాయ వైద్య కళాశాల విద్యార్థిని. వీరంతా ప్రస్తుతం ఐసోలేషన్‌లో ఉండి వైద్య సేవలు పొందుతున్నారు. శనివారం సేకరించిన 79 నమూనాలను పరీక్షిస్తే తాజా ఫలితం వెలువడింది.

సేవాగుణంతో చరిత్రలో చిరస్థానం

జగ్గంపేట: చరిత్రలో చిరస్థాయిగా నిలిచేది సేవాగుణం ఒక్కటేనని రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. మండలంలోని కాట్రావులపల్లిలో పానుగంటి లక్ష్మీ వెంకాయమ్మ ధర్మసత్రం 137వ ఆవిర్భావ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ఒమ్మి రఘురాం, సచివాలయాల మండల కన్వీనర్ బండారు రాజా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒమ్మి రఘురాం మాట్లాడుతూ ధర్మసత్రం ద్వారా నేటికీ పేదలు, వృద్ధులు, వికలాంగులకు అన్నదానం, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం సత్రం ఈఓ ఎంఎస్ఎస్ఎస్ శర్మ ఆధ్వర్యంలో పేదలకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిట్టా సుగుణరావు, నాయకులు కంటే రామారావు, ఐఆర్ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లదిగో కలల వారధి

- పంట కాలువపై వంతెన నిర్మాణం పూర్తి
- ఓ దాత సహకారంతో సాధ్యం
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



జి.మేడపాడులో గోదావరి కాలువపై నిర్మించిన వంతెన

సామర్లకోట: వెతలు తీర్చేందుకు ఓ దాత ముందుకు వచ్చారు.. అన్నీ తానై వంతెన నిర్మించి రైతులు, ప్రజల కష్టాలు గట్టెక్కించారు.. సామర్లకోట మండలం జి.మేడపాడు కెనాల్ రోడ్డులో గోదావరి కాలువపై వంతెన నిర్మించి అందరితో శెభాష్ అనిపించుకుంటున్నారు. జి.మేడపాడు గ్రామ రైతులకు 2,500 ఎకరాల పంట భూములు గోదావరి కాలువ అవతలి వైపు ఉన్నాయి. అదే విధంగా సుమారు వంద కుటుంబాలు అక్కడే నివాసం ఉంటున్నారు. బ్రిటీష్ వారి కాలంలో సుమారు 125 ఏళ్ల కిందట గోదావరి కాలువ దాటేందుకు నిర్మించిన వంతెన శిథిలం కావడంతో కష్టాలు మొదలయ్యాయి. ఈ వంతెనకు మధ్యలో ఆరేళ్ల కిందట రంధ్రం పడి కూలిపోయే పరిస్థితికి చేరింది. దీంతో రైతులు తమ పంటను వంతెన మీదుగా ట్రాక్టర్లపై ఇళ్లకు తీసుకురావడానికి అవకాశం లేకుండా పోయింది. రైతులు పంట పొలాల నుంచి పంటను వంతెన వద్దకు తీసుకువచ్చి అవతలి వైపు మరో ట్రాక్టరును ఏర్పాటు చేసుకుని కూలీల ద్వారా ధాన్యం బస్తాలను లోడింగ్ చేసుకునే వారు. ఇటువంటి పరిస్థితిలో వంతెన ఎప్పుడు కూలిపోతుందోనని సర్వత్రా ఆందోళన నెలకొంది. ఈ తరుణంలో రెండేళ్ల కిందట తాను ఉన్నానంటూ దాత నలమాటి జానకిరామయ్య ముందుకు వచ్చారు. వంతెన నిర్మాణానికి ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారుల అనుమతి తీసుకున్నారు. ఈ మేరకు శిథిలమైన వంతెనను కూల్చివేసి కొత్తగా వంతెన నిర్మాణానికి ఏడాది కిందట శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం వంతెన పనులు పూర్తి కావడంతో పాటు అప్రోచ్ రోడ్డునూ వేశారు. దాళ్వా పంట చేతికి వచ్చే సమయానికి వంతెన పూర్తి కావడంతో తమ వాహనాల ద్వారా పంటకు తీసుకు వెళ్లడానికి మార్గం ఏర్పడిందని రైతులు అంటున్నారు. వంతెన నిర్మాణ సమయంలో రైతులు వేట్లపాలెం నుంచి తమ పంటను ఇళ్లకు తీసుకు వచ్చేవారు. వంతెన పూర్తి కావడంతో రైతులు తమ వంతు సహకారం అందించడానికి ముందుకు వస్తున్నారు. అదే విధంగా రైల్వే ఉన్నతాధికారులతో చర్చించి గ్రామంలోని రైల్వే గేటు సమీపంలో ఉన్న కాను నుంచి చిన్న వాహనాల రాకపోకలకు రోడ్డు మార్గం ఏర్పాటు చేసి ఆ గ్రామ ప్రజల మన్ననలు పొందారు. అప్పటి వరకూ గేటు వేస్తే సైకిళ్లు కూడా వెళ్లలేని పరిస్థితి ఉండేది.


కష్టాలు తీరాయి



దాత నలమాటి జానకి రామయ్య వంతెనను కూల్చి వేయడంతో పాటు తన సొంత ఖర్చులతో నిర్మాణం పూర్తి చేశారు. ప్రారంభంలో రైతులూ ఆర్థిక సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. అయితే వంతెన పూర్తి కావడంతో రైతులు తమ వంతు సహకారం అందిస్తున్నారు. వంతెన నిర్మాణంతో ప్రజల కష్టాలు తీరాయి.

–మోరంపూడి రమేష్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్, జి.మేడపాడు

అందరి సహకారంతో..



గ్రామ ప్రజలు, రైతులు వంతెన మీదుగా రాకపోకలకు ఇబ్బంది పడుతుండడంతో తన వంతు సాయం చేయాలని నిర్ణయించుకున్నాను. దీంతో కష్టమైనా వంతెన నిర్మాణ పనులు పూర్తి చేశాను. కొంత మంది పరిశ్రమ యజమానులు యంత్రాలు సరఫరా చేయడంతో పాటు మెటీరియల్ తక్కువ ధరకు వచ్చేందుకు సహకరించారు. దీంతో రూ.28 లక్షలతో వంతెన నిర్మాణం పూర్తి చేశాను.

– నలమాటి జానకిరామయ్య, దాత, జి.మేడపాడు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



వాకతిప్పలో సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా మండలంలోని వాకతిప్ప పద్మశాలి రామాలయం వద్ద ఆదివారం నిర్వహించిన ఏకాహంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి భజనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అందరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలని దొరబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



వృద్ధురాలికి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు



పి.వేమవరంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పి.దొంతమూరులో గడపగడపకూ మన ప్రభుత్వం

పిఠాపురం: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. మండలంలోని పి.దొంతమూరులో ఆదివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని ఆరా తీశారు. గత మూడేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గ్రామంలో డ్రైన్లు నిర్మించాలని, శ్మశాన వాటికలు అభివృద్ధి చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. డ్రైన్ల నిర్మాణానికి గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రత్యేక స్థలాన్ని పరిశీలించాలని వీఆర్‌ఓకు సూచించారు. స్థలం కేటాయించి, కొత్త శ్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. పి.దొంతమూరులో ప్రధానంగా డ్రైన్ల సమస్య తీవ్రంగా ఉందని, దీనిపై అన్ని వీధుల్లోనూ ప్రజల నుంచి వినతులు వస్తున్నాయన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నేత కొత్తపల్లి రమణబాబ్జి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జనరంజక పాలన జగన్‌కే సాధ్యం

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి
- పి.వేమవరంలో గడప గడపకూ..

సామర్లకోట: జనరంజక పాలన సీఎం జగన్‌కే సాధ్యమని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పి.వేమవరంలో సర్పంచ్ ఎలిశెట్టి నూకరత్నం, పార్టీ నాయకులు ఎలిశెట్టి నరేష్, భీమన్నదొర, ముసిరెడ్డి వెంకటేశ్వరరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీపతి సోంబాబుల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి ప్రవేశ పెటిన సంక్షేమ పథకాలు అందరినీ ఆకట్టుకుంటు న్నాయని తెలిపారు. పథకాలకు లబ్ధిదారులను పార్టీ రహితంగా ఎంపిక చేయడం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పథకాలు అందించడం చేస్తున్నారన్నారు. తన పాలన నచ్చితేనే ఓటు వేయమంటున్నారని, ఇంత ధైర్యంగా చెప్పిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. ఆయన పాలనలో పని చేయడం ఎంతో ఆనందంగా ఉందని, ముఖ్యమంత్రి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము కాకుండా నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు, ఉండూరు ఉపసర్పంచ్ కొప్పిరెడ్డి రాధాకృష్ణ, హుస్సేన్‌పురం ఉపసర్పంచ్ ఎవర్న చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి బుల్లియ్యకాపు, సొసైటీ అధ్యక్షులు వీరంరెడ్డి నాని, ఉటా వాసు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, పార్టీ నాయకులు అత్తిలి మణికంత, మేడిద రాజు, అత్తిలి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాండ్రకోటకు భక్తకోటి బారులు

- నూకాలమ్మ తల్లి దర్శనానికి తరలి వచ్చిన జన సందోహం





అమ్మవారి దర్శనానికి నాలుగు క్యూలైన్లలో వేచియున్న భక్తులు. (అంతర చిత్రం) భక్తుల పూజలు అందుకుంటున్న నూకాలమ్మ తల్లి

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ తల్లి దర్శనానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. కొత్త అమవాస్యను పురస్కరించుకుని సుమారు 45 రోజుల పాటు నిర్వహించే జాతరలో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఆలయ ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలతో తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ పోలీస్ బందోబస్తు కల్పించారు. వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, పాలు పంపిణీ చేసారు.

లారీ యజమానులకు సహకరిస్తా

- లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు హౌసింగ్ చైర్మన్ దవులూరి హామీ
- కార్యవర్గం ప్రమాణ స్వీకారం



సామర్లకోట లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం

సామర్లకోట: లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు తన వంతు సహకారం ఉంటుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో విజయం సాధించిన సంఘం కార్యకవర్గం యూనియన్ కార్యాలయంలో ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమానికి దవులూరి ముఖ్య అతిథిగా హాజరై నియోజకవర్గంలో అత్యధికంగా పరిశ్రమలు ఉన్నాయని వాటి యజమానులు, పెద్దాపురం, సామర్లకోట లారీ యజమానుల సంఘం సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పట్టణంలో 350కి మించి లారీలు ఉన్నాయని వారికి ఇబ్బంది లేకుండా చేస్తానని తెలిపారు. కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుగ్గిన నాగరాజు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి వెంకట అప్పారావు చౌదరి, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు నూతన కమిటీకి పలు సూచనలు చేసి కమిటీని అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షునిగా పబ్బినీడి దుర్గాప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా చోడే రామారావు, కార్యదర్శిగా పెదిరెడ్డి కృష్ణ, కోశాధికారిగా నాళం వీరప్రభాకరావు, ఉపాధ్యక్షులుగా పిడుగు సత్యనారాయణ, సత్తిరెడ్డి సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా భీమనాథుల రమణ, కంటిపూడి శ్రీనివాసు, నాళం చిన్నారావులతో పాటు మరో 20 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. వారిచేత దవులూరి ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీ నారాయణ, అధికార పార్టీ కౌన్సిలర్లు, టీడీపీ అధ్యక్షుడు అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజప్ప, దవులూరి దొరబాబు, దవులూరి సుబ్బారావులను సత్కరించారు.

రాజాధిరాజు క్రీస్తు



దివిలిలో మట్టల ప్రదర్శన చేస్తున్న సండే స్కూలు చిన్నారులు

పెద్దాపురం: ప్రపంచానికి రాజాధిరాజు ఏసుప్రభువేనని క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం దైవజనులు నంగిన సత్యానందం, నంగిన శామ్యూల్ సుదీప్ అన్నారు. మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని దివిలి, తిరుపతి, చదలాడ, కాండ్రకోటతో పాటు పిఠాపురం మండలం విరవ క్రీస్తు శాంతి ప్రార్థన మందిరాలతో పాటు పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఆయా చర్చిల్లో విశ్వాసులు మట్టలతో ప్రదర్శన నిర్వహించారు. అలాగే పట్టణంలోని తండ్రి కుమార పరిశుద్ధాత్మ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పరంజ్యోతిమ్మ, దానియేలు, వర ప్రసాద్ మట్టల ప్రదర్శన నిర్వహించారు. బైబిల్ మిషన్ స్వర్ణదేవాలయం ఆధ్వర్యంలో స్థానిక లూథరన్ స్కూల్ వెనుక ఉన్న బైబిలు మిషన్ చర్చి నుంచి మహిళలు మట్టలతో ర్యాలీ నిర్వహించారు.

సామర్లకోటలో..

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలోని ఆంధ్రాబాప్టిస్టు చర్చి, సెంటినరీ అగ్రస్థాన లూథరన్ చర్చి, సెంటినరీ బాప్టిస్టు చర్చి, సాలెమ్ బాప్టిస్టు చర్చిలలో క్రైస్తవులు మట్టలతో ర్యాలీలు చేశారు. ఉండూరు, వేట్లపాలెం, పవర గ్రామాలలో పాస్టర్లు కిరణ్‌బాబు, బి కిరణ్‌కుమార్, డాక్టర్ ఈలి సువార్తరాజు, వంకా జాన్, ఎంఎ జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం

పిఠాపురం: గుడ్ ఫ్రైడేకు ముందు వచ్చే మట్టల ఆదివారం పర్వదినాన్ని నియోజకవర్గంలో క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు ఈత కొమ్మలకు రంగు రంగుల పూలు అలంకరించి గ్రామాల్లో ర్యాలీలు చేశారు. నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో పలు గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం మట్టలతో ర్యాలీలు చేశారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రభుదాస్, ఎం.జాన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురం మండలం జములపల్లిలో మట్టలతో ర్యాలీ చేస్తున్న చిన్నారులు



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మట్టల ఆదివారం ర్యాలీ



సామర్లకోటలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

అధికార విభజనకే ఐసీడీఎస్ ప్రాజెక్టు



రూరల్ ప్రాజెక్ట్ వద్ద గర్భిణులకు సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీ గీత తదితరులు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- రూరల్ నియోజకవర్గంలో నూతన పీఓ కార్యాలయం
- ఎంపీ వంగా గీతతో కలసి ప్రారంభం

కాకినాడ రూరల్: అధికార వికేంద్రీకరణలో భాగంగా నియోజవర్గంలో ప్రత్యేకంగా సమగ్ర శిశు అభివృద్ధి పథక అధికారిణి కార్యాలయం (ఐసీడీఎస్ ప్రాజెక్టు) ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. సర్పవరంలో ఎంపీ వంగా గీతతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే కన్నబాబు ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. పోషణ్ పక్వాడను పురస్కరించుకుని గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. మెరుగైన పాలనకు వీలుగా సీఎం జగన్ జిల్లాను విభజించారని ఆయన పేర్కొన్నారు. సామర్లకోట, తాళ్లరేవు ఐసీడీఎస్‌ల పరిధిలో ఉన్న నియోజకవర్గ అంగన్‌వాడీ సెంటర్లకు ప్రత్యేక ప్రాజెక్టు ఏర్పాటు చేశారన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా కాకినాడ రూరల్, కరప మండలాల్లోని 205 అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. త్వరలో అర్బన్ డివిజన్లను చేరుస్తామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మెరుగ్గా పనిచేసి మహిళలు ఆరోగ్యంగా ఉండేలా చూడాలన్నారు. అంగన్ వాడీ సెంటర్లకు దశలవారీగా శాశ్వత భవనాలు నిర్మిస్తామన్నారు. ఈ ప్రాజెక్టుకు గ్రామ నాయకుడు పుల్ల చందు, సర్పంచ్ శీలం చిన్నా భవనం చూపారన్నారు. 2023ను అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించారని వీటి ద్వారా ఆరోగ్యం కలుగుతుందన్నారు. సీడీఓలు జీవీ రమణ, పూర్ణిమ, పీడీ కార్యాలయ నోడల్ అధికారి లక్ష్మి, సూపర్‌వైజర్లు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, కరప జెడ్పీటీసీ యాళ్ళ సుబ్బారావు, ఎంపీపీలు గోపుశెట్టి పద్మజ బాబ్జీ, పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, పుల్ల చందు, పుల్ల కోటేశ్వరరావు, సర్పంచ్ శీలం చిన్నా, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, ఎంపీటీసీలు సారా రాజేష్, గుత్తుల శ్రీనివాస్, కాకి సురేష్, తోటకూర శ్రీను పాల్గొన్నారు.

మహిళలకు పుట్టిళ్లు అంగన్‌వాడీ కేంద్రాలు : ఎంపీ గీత

అంగన్‌వాడీ కేంద్రం మహిళలకు పుట్టింటి వంటిదని ఎంపీ గీత పేర్కొన్నారు. ఐసీడీఎస్ వ్యవస్థ వల్ల మహిళలకు పోషకాహారం లభిస్తోందన్నారు. తల్లీ బిడ్డలకు మెరుగైన ఆరోగ్యం కోసం సరైన పోషక విలువల ఆహారాన్ని సక్రమంగా అందివ్వాలని ఆమె కోరారు. పండంటి బిడ్డకు జన్మనిచ్చే వరకు గర్భిణులను కంటికి రెప్పలా చూసుకోవాలని అంగన్‌వాడీలకు ఎంపీ పిలుపునిచ్చారు.

అలరించిన 'ప్రేమతో నాన్న' నాటిక



'ప్రేమతో నాన్న' నాటికలో ఓ సన్నివేశం

ఏలేశ్వరం: మండలంలోని పెద్దనాపల్లిలో రామాలయం నిర్మించి వందేళ్లు పూర్తి కావడంతో పాటు శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని గొల్లపల్లి చెల్లయ్య మెమోరియల్ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయిలో నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం ప్రదర్శించిన ప్రేమతో నాన్న నాటిక ప్రేక్షకులను అలరించింది. అత్తారింటిలో భర్త వేధింపులు తాళలేక పుట్టింటికి వచ్చిన కూతురిని తండ్రి ఆదుకున్న ఇతివృత్తంతో సాగింది ప్రేమతో నాన్న నాటిక. కొలకలూరి సాయిఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటికకు గోపరాజు విజయ్ దర్శకత్వం వహించగా విజయార్కే రచన అందించారు. రెండో ప్రదర్శనగా అందిన ఆకాశం నాటిక ప్రదర్శించారు. ప్రేమపేరుతో మోసపోయిన స్త్రీ తనబిడ్డను ప్రయోజకుడిగా చేయడమే ప్రధానాంశంగా ఈ నాటకం సాగింది. హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటికకు ఎస్ఎం బాషా దర్శకత్వం వహించగా, రచన అనంతహృదయరాజ్ అందించారు. కళాపరిషత్ అధ్యక్షుడు, ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి(బుజ్జి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ నాటిక పోటీలు సోమవారంతో ముగుస్తాయి.

'పద్మశ్రీ' గ్రహీత చింతలపాటికి సన్మానం



పద్మశ్రీ పురస్కార గ్రహీత వెంకటపతి రాజును సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న తపాలా ఉద్యోగులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో ఆదివారం పద్మశ్రీ పురస్కార గ్రహీత చింతలపాటి వెంకటపతిరాజు పర్యటించారు. స్థానిక తపాలా కార్యాలయంలో వెంకటపతిరాజును అఖిలభారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేపకాయల వీర్రాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి భూలోకం ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో సన్మానించారు.